క్లుప్తంగా

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష


టెక్కలి: పరీక్షకు హాజరైన విద్యార్థినులు

టెక్కలి: మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాలలో వివిధ తరగతుల్లో ప్రవేశానికి సంబంధించి ఆదివారం నిర్వహించిన పరీక్ష టెక్కలిలో ప్రశాంతంగా జరిగింది. ఈ మేరకు ఎంజేపీ ఏపీ పాఠశాల ప్రిన్సిపాల్ పి.సుధారాణి ప్రత్యేక పర్యవేక్షణలో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. ఈ కేంద్రంలో 208 మంది విద్యార్థినులను కేటాయించగా 188 మంది పరీక్షకు హాజరయ్యారు.

పవర్ బోర్ పనులు ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న కౌన్సిలర్ ఆశారాణి

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ పురపాలక సంఘం 26వ వార్డు పరిధి గొల్లవీధిలో పవర్ బోర్ ఏర్పాటు పనులను కౌన్సిలర్ తంగుడు ఆశారాణి ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు, నాయకులు తంగుడు హరిశంకర్, మల్లా ప్రకాశరావు, వార్డు పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థులకు సత్కారం


విద్యార్థులను సత్కరిస్తున్న సంఘ ప్రతినిధులు

కవిటి: తల్లిదండ్రుల ఆకాంక్షలను నిజం చేస్తూ ఉన్నత ఉద్యోగాలలో స్థిరపడాలని అగ్నికులక్షత్రియ సంఘం ప్రతినిధులు కోరారు. మండలంలోని జగతి గ్రామంలో కంచి కామాక్షి అగ్నికుల క్షత్రియ సేవా సంఘం ఆధ్వర్యంలో ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చాటిన పులకల కౌశిక్, పొల్లాయి కుసుమలత, పొల్లాయి శ్రీరాంలను ఆదివారం ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందించారు. సంఘ పెద్ద పులకల మాధవరావు ఆర్థిక సాయంతో విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య


ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని ధర్మపురం పాఠశాల ప్రధానోపాధ్యాయులు కీలు సోమేశ్వరరావు అన్నారు. ఆదివారం ధర్మపురం గ్రామంలో అడ్మిషన్ డ్రైవ్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ బడుల్లో లభిస్తున్న ఉచిత విద్య, విద్యార్థులకు అందుతున్న పథకాల గురించి వివరించారు. ఉపాధ్యాయులు ధర్మారావు, విద్యాకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలన


రికార్డులను పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

మందస: మండలంలో ఉపాధి హామీ పథకంతోపాటు వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను జాతీయస్థాయి మానిటరింగ్ కమిటీ పీవో కిరణ్ పాఢి, టెక్నికల్ ఆఫీసర్ అజయ్ ప్రతాప్ సింగ్‌తో కూడిన బృందం ఆదివారం పరిశీలించింది. మందసలో మూడు సీసీ రోడ్లు, మూడు చెరువులు, చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. అలాగే సాభకోట, చీపిలో బీటీ రోడ్లు, జిల్లుండలో సీసీ రోడ్ల నాణ్యతను పరిశీలించారు. ఏపీడీ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో రమేష్ నాయుడు, పలువురు అధికారులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో నామ సంకీర్తన


నామ సంకీర్తన చేస్తున్న భక్తులు

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని బైపల్లి గ్రామంలో ఉన్న సత్యసాయి మందిరంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో నామ సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. 23వ పర్తి యాత్రలో భాగంగా ప్రపంచ శాంతి కోసం ఈ కార్యక్రమం చేపట్టినట్లు సత్యాయి సమితి కన్వీనర్ తెప్పల సాయిరాం చెప్పారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పశువులకు నీటిగండం!

- అడుగంటిన చెరువులు
- నీటి కోసం విలవిల్లాడుతున్న పశువులు


టెక్కలిపట్నంలో ఎండిపోయిన చెరువు

కాశీబుగ్గ: మండుతున్న ఎండలు పశువులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. కొన్ని నెలలుగా వర్షాలు లేకపోవడం.. వేసవి నేపథ్యంలో చెరువులన్నీ అడుగంటిపోయాయి. ఎక్కడ కూడా చుక్క నీరు లేకపోవడంతో తాగునీటి కోసం పశువులు అల్లాడిపోతున్నాయి. వీటిని కాపాడుకోవడానికి వాటి యజమానులు తీవ్రమైన అవస్థలు పడుతున్నారు. పలాస నియోజకవర్గం పరిధిలోని మందస, పలాస, వజ్రపుకొత్తూరు మండలాలతో పాటు పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఉన్న ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు తాగునీటి కోసం తహతహలాడుతున్నాయి. ఈ పరిస్థితిలో సుదూరంగా ఉండే బావుల వద్దకు పశువులను వాటి యజమానులు తీసుకొని వెళ్లి వాటికి నీటిని అందించి దాహార్తి తీరుస్తున్నారు.


నీరు లేని చెరువులో మేత మేస్తున్న గేదెలు

పలాస నియోజకవర్గంలో పశువుల వివరాలు..

పలాస పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకుల కార్యాలయం పరిధిలో మందస, వజ్రపుకొత్తూరు, పలాస మండలాలు ఉన్నాయి. వీటి పరిధిలో ఆవులు 31,656, గేదెలు 6,648, గొర్రెలు, మేకలు 42,962 ఉన్నాయి. ఇవన్నీ ఇప్పుడు నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నాయి. వాటి యజమానులు వీటిని రక్షించుకోవడానికి అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు శ్రద్ధ వహించి చెరువులను నీటితో నింపాలని, అలాగే అవసరమైన ప్రదేశాలను గుర్తించి నీటితొట్టెలను ఏర్పాటు చేయాలని పాడి రైతులు కోరుతున్నారు.

పశువులను కాపాడుకోవడం కష్టమే..



వేసవి నేపథ్యంలో చెరువులు, వాగులు పూర్తిగా ఎండిపోయాయి. నీరులేక పశువులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. పలాస మండలం రేగులపాడు గ్రామానికి చెందిన పశువులను సమీపంలో ఉన్న మెళియాపుట్టి మండలం పెద్దమడి గ్రామంలోని చెరువు వద్దకు తీసుకెళ్లి నీటిని తాగిస్తున్నాం. అందులో కూడా నీరు అడుగంటింది. ఇదే పరిస్థితి ఉంటే పశువులను కాపాడుకోవడం కష్టమే. అధికారులు స్పందించి చెరువుల్లో నీటిని నింపాలి. అవసరమైన చోట నీటి తొట్టెలను ఏర్పాటు చేయాలి.

– పానిల కూర్మారావు, రేగులపాడు గ్రామం, పలాస మండలం

మెయిన్‌రోడ్డు గోతులు పూడ్చివేత

సాక్షి ఎఫెక్ట్...

కంచిలి: మండల కేంద్రం కంచిలి మెయిన్ రోడ్డులో ఏర్పడిన గోతులను పూడ్చే పనులకు ఆర్అండ్‌బీ శాఖ అధికారులు శ్రీకారం చుట్టారు. జాతీయ రహదారి కూడలి కేశవరావు దాబా వైపు నుంచి ఆదివారం ప్రారంభించారు. ఈ రోడ్డు శిథిలం కావడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీనిపై మార్చి 29న 'సాక్షి'లో 'కంచిలి రోడ్డుపై నడక యాతన!' శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. వాస్తవానికి పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉండగా.. ప్రస్తుతం తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నారు. జూన్ ఒకటి నుంచి పదో తేదీ వరకు గ్రామదేవత కంచమ్మతల్లి అమ్మవారి ఉత్సవాలు నేపథ్యంలో ముందుగా మరమ్మతులు చేపడుతున్నామని అధికారులు చెబుతున్నారు. పూర్తిస్థాయిలో గోతులను పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.


గోతులను పూడ్చుతున్న దృశ్యం

జూలై 5న లోక్ అదాలత్

కాశీబుగ్గ: రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ వారి ఉత్తర్వుల ప్రకారం మే పదో తేదీన పలాస జూనియర్ కోర్టులో జరగవలసిన జాతీయ లోక్ అదాలత్ వాయిదా పడింది. దీన్ని జూలై ఐదో తేదీన తిరిగి నిర్వహించనున్నట్టు పలాస జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవా సంఘం అధ్యక్షులు యు. మాధురి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. న్యాయవాదులు, కక్షిదారులు మార్పును గమనించాలని కోరారు.

నేడు ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా

కాశీబుగ్గ: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పలాస ఆర్టీసీ డిపో వద్ద సోమవారం ధర్నా చేపడుతున్నట్టు ఎన్ఎంయూ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. మధ్యాహ్న సమయంలో డిపో ప్రధానగేటు ఎదురుగా వాహనాల రాకపోకలను అడ్డుకుని నిరసన తెలియజేస్తామన్నారు. యూనియన్ పిలుపు మేరకు ఉద్యోగులంతా హాజరు కావాలని ప్రతినిధులు కోరారు.


ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


సమావేశంలో మాట్లాడుతున్న పేరాడ తిలక్

- వైఎస్సార్‌సీపీ టెక్కలి ఇన్‌చార్జి పేరాడ తిలక్
- నందిగాం మండల నాయకులతో సమావేశం

నందిగాం: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ అన్నారు. అలాగే కార్యకర్తలను చైతన్య పరిచేలా సామాజిక మాధ్యమాల్లో కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రచారం చేయాలని సూచించారు. ఆదివారం సాయంత్రం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద మండల పరిధిలోని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ పటిష్టతకు గ్రామస్థాయి కమిటీలను పూర్తిస్థాయిలో నియమించుకోవాలని అనుబంధ విభాగాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అలాగే కార్యకర్తను చైతన్య పరచవలసిన బాధ్యత తీసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను, సూపర్‌సిక్స్ పేరుతో చేసిన మోసాలను సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం చేయాలన్నారు. ముఖ్యమంత్రిగా గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మంచిని, చంద్రబాబు చేసిన వంచనను వివరించాలన్నారు. 2019లో జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తొమ్మిది నెలలకే కరోనా వంటి విపత్తు వచ్చినా, ప్రమాణ స్వీకారం నాటికి ఖజానాలో కేవలం రూ. వంద కోట్లే ఉన్నా, కరోనా వలన ప్రభుత్వ ఆదాయం సుమారు రూ.70 వేల కోట్లు కోల్పోయినా ఇచ్చిన హామీలకు కుంటిసాకులు చెప్పకుండా అన్నీ నెరవేర్చారని గుర్తు చేశారు. అలాగే రెండున్నర లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు, సచివాలయాలు, ఆర్‌బీకేలు, మెడికల్ కాలేజీలు, ఫిషింగ్ హార్బర్లను ఏర్పాటు చేశారన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏడాది కాలంలోనే రూ.లక్షన్నర కోట్లు అప్పులు చేయడం, మరోవైపు రాజధాని పేరుతో లక్ష ఎకరాల భూమి సేకరించడం తప్పా సూపర్‌సిక్స్ పేరుతో ప్రజలకు ఇస్తామన్న ఒక్క పథకం కూడా అమలు చేయకుండా కాలం గడుపుతున్నారని మండిపడ్డారు. సమావేశంలో ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కురమాన బాలక్రిష్ణారావు, మండల పార్టీ అధ్యక్షుడు తమిరె ఫాల్గుణరావు, మాజీ ఎంపీపీ యర్ర చక్రవర్తి, ఎల్.ధనరాజ్, జడ్యాడ జయరాం, అంబోడి విష్ణు, పోలాకి మోహనరావు పాల్గొన్నారు.

ఉగ్రవాదం నశించాలి


కొవ్వొత్తులతో నిరసన తెలియజేస్తున్న యువకులు

సోంపేట: ఉగ్రవాదం నశించాలని జింకిభద్ర గ్రామానికి చెందిన యువత నినదించింది. కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ జింకిభద్ర గ్రామంలో ఆదివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. వివేకానందుని విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించి ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు.

టెక్కలి: కశ్మీర్‌లో ఉగ్రదాడిని నిరసిస్తూ టెక్కలిలో వివిధ సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. అంబేడ్కర్ జంక్షన్ నుంచి వైఎస్సార్ జంక్షన్ వరకు ర్యాలీ చేపట్టిన అనంతరం ఉగ్రవాదుల దిష్టిబొమ్మలను దహనం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగులు, విశ్రాంత ఆర్మీ సిబ్బంది, ప్రజా చైతన్య కళా సమితి సభ్యులు పాల్గొన్నారు.


టెక్కలిలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న దృశ్యం

• కళాకారుడికి సత్కారం



కళాకారుడు, సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక ముఖ్య సలహాదారులు డాక్టర్ కుమార్ నాయక్‌కు ఇటీవల కందుకూరి విశిష్ట పురస్కారం వరించింది. సందర్భంగా కళావేదిక ప్రతినిధులు ఆదివారం దుశ్శాలువతో సత్కరించి అభినందించారు కార్యక్రమంలో సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక అధ్యక్షులు రాపాక ధనరాజు, ఉపాధ్యక్షులు దున్న రామారావు, ప్రచార కార్యదర్శి కుత్తుం వినోద్, పుక్కళ్ల రాజేంద్ర, తెప్పల అప్పారావు పాల్గొన్నారు. – కాశీబుగ్గ

• ఆధ్యాత్మిక సమావేశం

ప్రజలకు హిందూ ధర్మం విశిష్టను చాటి చెప్పే విధంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు లోకనాథం ఆనంద్ అన్నారు. కోటబొమ్మాళి మండలం కొత్తపేట శివ కేశవ ఆలయంలో ఆదివారం ఆధ్యాత్మిక సమావేశం నిర్వహించారు. వీహెచ్‌పీ సభ్యులంతా గ్రామాల్లో ప్రజలకు హిందూ ధర్మం విశిష్టతను వివరించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు స్వామిజీలతో పాటు హిందూ ధర్మం ప్రచార సభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి యోగ చంద్రశేఖర్, బండి రాములమ్మ, జనార్దన్, శ్యామ్, కంబాల అప్పాలరాజు పాల్గొన్నారు. – టెక్కలి



• కరపత్రాలు విడుదల

మండల కేంద్రం కంచిలి గ్రామదేవత కంచమ్మతల్లి ఉత్సవాల కరపత్రాలను ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో విడుదల చేశారు. స్థానిక రైల్వేస్టేషన్ ఆవరణలోని సీతారామ మందిరం వద్ద ఆదివారం సాయంత్రం సమావేశమయ్యారు. జూన్ ఒకటి నుంచి పదో తేదీ వరకు ఉత్సవాలను వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే లైటింగ్, సాంస్కృతిక కార్యక్రమాలు బుకింగ్ వంటివి పూర్తిచేసినట్లు పేర్కొన్నారు. కరపత్రంలో తొమిమది రోజులపాటు నిర్వహించే ఉత్సవాల వివరాలను పొందుపరిచారు. గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. – కంచిలి



• చింతామణి అమ్మవారికి పూజలు


అమ్మవారి ప్రతిరూపాలను ఊరేగిస్తున్న భక్తులు

ఉద్దానం ప్రజల ఆరాధ్యదైవం.. కవిటిలో వెలసిన చింతామణి అమ్మవారికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. బెజ్జిపుట్టుగకు చెందిన కాళికావేషధారుల నాట్య ప్రదర్శన నడుమ అమ్మవారి ప్రతిరూపంగా భావించే గజముద్దను మేళతాళాలతో కవిటి పట్టణ వీధుల్లో ఊరేగించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. – కవిటి

ఇచ్ఛాపురంలో దాహం కేకలు!

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు



వాటర్‌ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న మహిళలు


దూరం నుంచి ఇంటికి నీటిని తీసుకెళ్తున్న మహిళలు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మున్సిపాలిటీ ప్రజలు దాహం కేకలు పెడుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలో 23 వార్డులు ఉండగా.. సుమారు 50 వేల మంది నివసిస్తున్నారు. వీరందరి అవసరాలకు అనుగుణంగా పురపాలక సంఘం మంచినీటిని అందించలేకపోతుంది. పట్టణంలోని మొదటి మూడు వార్డుల పరిధిలో ఉన్న పురుషోత్తపురం, అమీన్‌సాహెబ్‌పేట, బోర్డర్ ప్రాంతాలకు కుళాయిల్లేక సుమారు ఏళ్ల తరబడి నీటికష్టాలు ఎదుర్కొంటున్నారు. మిగిలిన ప్రాంతాలకు బాహుదా నదిలో ఉన్న ఇన్‌ఫిల్టర్ బావి నుంచి పైపులైన్ వేసి.. కుళాయిల ద్వారా నీటిని మున్సిపల్ అధికార యంత్రాంగం సరఫరా చేసేది. అలాగే వేసవిలో మంచినీటి సమస్య రాకుండా అధికారం యంత్రాంగం ముందస్తు చర్యలో భాగంగా డిసెంబర్ నుంచి ఫిబ్రవరి మధ్యలో నదిలోని ఊటబావుల వద్ద రివర్ బండ్ నిర్మాణం చేపట్టేవారు. తద్వారా ప్రజలకు రెండు రోజులకొకసారి కుళాయిల ద్వారా నీటిని అందించి వేసవిలో నీటి ఎద్దడిని అధిగమించేవారు. ప్రస్తుతం వేసవి దృష్ట్యా మున్సిపల్ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవడంలో విఫలమవ్వడంతో ప్రజలకు నీటి కష్టాలు రెట్టింపయ్యాయి. ఏప్రిల్ ప్రారంభంలో పదిరోజులకు ఒకసారి నీటిని సరఫరా చేసేవారు. అయితే ముందస్తు చర్యలు తీసుకోవడంలో మున్సిపల్ అధికారులు శ్రద్ధ చూపకపోవడంతో నదిలోని ఊటబావుల్లో నీరు చేరడంలేదు. ఫలితంగా కుళాయిల ద్వారా నీటిని అందించలేని పరిస్థితి నెలకుంది. ప్రస్తుతం పట్టణ ప్రజలకు ట్యాంకర్ల ద్వారానే నీటిని సరఫరా చేస్తున్నారు. సరిపడా నీటిని సరఫరా చేయకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ట్యాంకర్ల ద్వారా నీటిసరఫరా



మున్సిపాలిటీకి చెందిన రెండు ట్యాంకర్లతో పాటు నాలుగు ప్రైవేట్ ట్యాంకర్లను అద్దెకు తీసుకొని వాటి ద్వారా నీటిని సరఫరా చేస్తున్నాం. ప్రైవేటు ట్యాంకర్ల ద్వారా రోజుకి ఆరు నుంచి ఏడు ట్రిప్పులతో ఇచ్ఛాపురం ప్రజలకు, ఐదు ట్రిప్పులతో మొదటి మూడు వార్డుల ప్రజలకు, రెండేసి ట్రిప్పులతో రత్తకన్న గ్రామానికి నీటిసరఫరా చేస్తున్నాము.

– ఎస్.రమేష్, మున్సిపల్ కమిషనర్, ఇచ్ఛాపురం

నీటి కోసం గొడవ పడుతున్నాం..



మున్సిపల్ అధికారులు ట్రాక్టర్ల ద్వారా సరఫరా చేస్తున్న నీటిని పట్టుకునే సమయంలో మహిళలు గొడవలు పడుతున్నారు. నీటిని పట్టుకోవాలంటే చాలా ఇబ్బందిగా ఉంటుంది. అయినా కావాల్సినంత నీరు లభ్యం కావడం లేదు.

– బి.మంగమ్మ, ఇచ్ఛాపురం మున్సిపాలిటీ

తగినంత నీటిని సరఫరా చేయాలి



ఎప్పుడూలేనంతగా ఈసారి నీటి సమస్య వచ్చింది. ట్యాంకర్ల ద్వారా అందిస్తున్న నీరు అవసరాలకు సరిపడడం లేదు. ప్రజల అవసరాలకు అనుగుణంగా తగినంత నీటిని సరఫరా చేయాలి. ట్రాక్టర్లతో ఎక్కువ నీటిని సరఫరా చేయాలి.

– జి.దమయంతి, 9వ వార్డు, ఇచ్ఛాపురం